## క్లుప్తంగా

### స్థల సేకరణకు సర్వే ప్రారంభం

మండపేట: మండలంలోని కేశవరం రైల్వే గేటు వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణం నిమిత్తం స్థల సేకరణకు సంబంధించి సర్వే పనులను శనివారం రెవెన్యూ సిబ్బంది చేపట్టారు. సామర్లకోట కెనాల్ లోని క్వారీ కాలువ తూము నుంచి పంచాయతీ చెరువు గట్టు మీదుగా పెద్ద చెరువు గండి వరకు సర్వే నిర్వహించారు. ప్రైవేటు స్థలాలను ఎంత సేకరించాలనే విషయమై సర్వే చేశారు. రెండు, మూడు రోజుల్లో ఎంత స్థలం సేకరించాలనే విషయమై స్పష్టత వస్తుందని రెవెన్యూ సిబ్బంది తెలిపారు.

### దళితుల హక్కుల సాధనకు పాటు పడాలి



కుయ్యేరులో దళిత రక్షణ మహాధర్నా గోడపత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

కాజులూరు: దళితుల హక్కుల సాధనకు ప్రభుత్వాలు పాటుపడాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు అన్నారు. శనివారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా నాయకుడు కమిడి సత్యశ్రీనివాస్ ఆధ్వర్యంలో సీపీఎం నాయకులు మండల గ్రామాల్లోని దళితవాడల్లో పర్యటించి ఈ నెల 29న విజయవాడలో జరగనున్న దళిత రక్షణ మహాధర్నా గోడపత్రికను ఆవిష్కరించారు. కుయ్యేరులో ఆయన మాట్లాడుతూ దళిత సమస్యల పరిష్కారంలో భాగంగా పలు డిమాండ్ల సాధనకై దళిత రక్షణ మహాధర్నా నిర్వహిస్తున్నామని మండల గ్రామాల్లో దళితులంతా తప్పక హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో బచ్చల శర్మ, తాతపూడి రాంబాబు, లాజరు, ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

### పాఠశాలలకు క్రీడా సామగ్రి పంపిణీ



హెచ్ఎంలకు క్రీడా సామగ్రి అందిస్తున్న ఎంఈఓ ఆంజనేయులు

కె.గంగవరం: మండలంలోని 26 గ్రామాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలలకు విద్యా శాఖ ఆధ్వర్యంలో ఎంఈఓ సీహెచ్ ఆంజనేయులు ఆయా పాఠశాలల హెచ్ఎంలకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. మండలంలోని 10 ఉన్నత పాఠశాలలు, 4 ప్రాథమికోన్నత పాఠశాలు, 58 ప్రాథమిక పాఠశాలు, ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వాలీబాల్, నెట్‌బాల్, త్రోబాల్, యోగా కిట్‌లు, టెన్నికాయిట్, షాట్‌పుట్, ఫుట్‌బాల్ తదితర వ్యాయామ, క్రీడా సామగ్రిని అందించారు. ఎంఈఓ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందించే క్రీడాసామగ్రితో విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యతను వెలికితీయవచ్చన్నారు. ప్రతి విద్యార్థికి చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమన్నారు.

### స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు

కె.గంగవరం: మండలంలోని పామర్రు ఉన్నత పాఠశాలలో పేద విద్యార్థులకు సత్య స్కాన్ అధినేత కాదా వెంకటరమణ స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందించారు. వాటిని హెచ్ఎం పితాని శ్రీనివాస్ పాఠశాలలోని 17 మంది విద్యార్థులకు అందించారు. ఆయన మాట్లాడుతూ ఎనిమిదో తరగతి విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం అందించే స్కాలర్ (ఎన్ఎంఎంఎస్) షిప్ కోసం త్వరలో పరీక్షలు జరగనున్నాయని వాటి కోసం విద్యార్థులు ప్రిపేర్ అవ్వడానికి స్టడీ మెటీరియల్ ఉపయోగపడుతుందన్నారు. ఈ స్టడీ మెటీరియల్ ఉపయోగించుకుని పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే నాలుగు సంవత్సరాల్లో విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం రూ.50 వేలు అందిస్తుందన్నారు.

### నగదు రహిత లావాదేవీలపై అవగాహన



నగదు రహిత లావాదేవీలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కపిలేశ్వరపురం: పంచాయతీల్లో నగదు రహిత లావాదేవీలపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ ఎ.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నగదు రహిత లావాదేవీలు జరిపే సాంకేతిక అంశాలపై శిక్షణ పొందిన ప్రతినిధులు అవగాహన కల్పించారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ప్రయోగాత్మకంగా లావాదేవీలపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నూతన ఆవిష్కరణ ఏదైనా సాంకేతిక సమస్యలు సహజంగా ఎదురవుతాయని, వాటిని అవగాహన అనే ఆయుధంతో పరిష్కరించుకుంటూ ముందుకు సాగాలని సూచించారు.

# పోషకాహారంతోనే ఆరోగ్యం

- అవగాహన లేకే అవస్థలు
- తక్కువ ఖర్చుతో సమతుల ఆహారం
- గర్భిణులు, బాలింతలు, చిన్నారుల పోషణకు ప్రభుత్వం ప్రాధాన్యం




పోషకాహార పదార్థాలు

రామచంద్రపురం రూరల్: పోషకాహార ప్రాధాన్యం తెలిస్తే చాలా రోగాలకు దూరం కావచ్చు. రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవచ్చు. దీన్ని దృష్టిలో ఉంచుకునే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సీఎం జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులలో పోషకాహార లోపం సరిదిద్దేందుకు, రక్త హీనతను నివారించడానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు పోషక అవసరాల్లో 40 శాతం మాంసకృత్తులు, ఐరన్ సిరప్ అందజేయాలనేది ప్రభుత్వ ఉద్దేశం. వారికి గతంలో రోజూ మధ్యాహ్నం పౌష్టికాహార భోజనం అందించేవారు. అయితే ప్రభుత్వం సర్వే ద్వారా గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలకు భోజనం కోసం రావడానికి ఇబ్బంది పడుతున్నారని గుర్తించి టేక్‌హోం రేషన్ ద్వారా బియ్యం, కంది పప్పు, నూనె, కోడిగుడ్లు, వీటికి అదనంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ పేరుతో 6 రకాలు (కేజీ అటుకులు, కేజీ రాగిపిండి, కేజీ జొన్నపిండి, పావు కేజీ ఖర్జూరం, పావు కేజీ బెల్లం, పావు కేజీ వేరుశనగ చిక్కీలు) అందిస్తున్నారు. వారు ఇళ్లల్లో పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారా? లేదా అని అంగన్‌వాడీ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 263 అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. వీటిలో 8 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు సైతం ఉన్నాయి. ఆరేళ్ల లోపు చిన్నారులు 10594 మంది, ఆయా కేంద్రాల పరిధిలో 1455 మంది గర్భిణులు, 1391 మంది బాలింతలు ఉన్నారు.

| మండలం | మెయిన్ కేంద్రాలు | మినీ కేంద్రాలు | పిల్లలు | | | | గర్భిణులు | బాలింతలు |
|---|---|---|---|---|---|---|---|---|
| రామచంద్రపురం | 91 | 6 | నె.-3సం.లు | 2432 | 3సం.-6సం.లు | 1243 | 518 | 512 |
| కె.గంగవరం | 88 | 4 | 6నె.-3సం.లు | 2396 | 3సం.-6సం.లు | 1112 | 510 | 475 |
| కాజులూరు | 76 | 4 | 6నె.-3సం.లు | 1913 | 3సం.-6సం.లు | 1498 | 427 | 404 |

### ఏ తల్లీ మరణించకూడదని..



ఏ తల్లీ బిడ్డకు జన్మనిస్తూ మరణించకూడదని, అదే విధంగా ఏ బిడ్డా మరణించడానికే జన్మించకూడదన్న గొప్ప సదాశయంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.కోట్లు వెచ్చించి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు గతంలో ఏ ప్రభుత్వంలోనూ జరగని విధంగా సంపూర్ణ పోషణ అందిస్తున్నారు.

– వడ్డపాటి లక్ష్మీరత్నం, అంగన్‌వాడీ టీచర్, నరసాపురపుపేట, రామచంద్రపురం మండలం

### బాల్యదశ ఎంతో కీలకం



సమాజానికి సమర్థులైన బిడ్డలను అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన కుటుంబం బలోపేతమైన సమాజం తయారవుతుంది. మనిషిలో ఐదేళ్లలోపే మెదడు 90 శాతం వృద్ధి చెందుతుంది. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది.

– ఎస్.ప్రశాంతి, వైద్యాధికారి, రామచంద్రపురం మండలం

# ‘కాపు కాసే నేస్తం’ జగనన్నే..

- మంత్రి వేణు
- నియోజకవర్గంలో 19,128 మంది కాపు మహిళల ఖాతాల్లో రూ. 29.11 కోట్లు జమ
- ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ కాపు మహిళల సభ



వెంకటాయపాలెంలో కాపు మహిళల కృతజ్ఞతా సభలో మాట్లాడుతున్న మంత్రి వేణు



ముఖ్యమంత్రి జగన్‌కు తోడుగా ఉంటామంటూ నినాదాలు చేస్తున్న కాపు మహిళలు

రామచంద్రపురం రూరల్: సామాజిక కట్టుబాట్లతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాపు మహిళల జీవితాల్లో ‘కాపు నేస్తం’ పథకం ద్వారా వెలుగులు నింపిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే చెందుతుందని ‘కాపు కాసే నేస్తం’ జగనన్న మాత్రమేనని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని వెంకటాయపాలెంలో నియోజకవర్గ కాపు మహిళలు సీఎం జగన్‌కి కృతజ్ఞతలు తెలుపుతూ నిర్వహించిన సభలో మంత్రి వేణు పాల్గొని మాట్లాడారు. గతంలో చంద్రబాబునాయుడు సంవత్సరానికి రూ.5 వేల కోట్లు కాపుల కోసం వెచ్చిస్తానని చెప్పి తన పూర్తి పదవీ కాలంలో కేవలం రూ.10 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశాడన్నారు. అంతే కాకుండా కాపులకు రిజర్వేన్లు తన పరిధిలోని అంశం కాదని తెలిసినా చేస్తానని చెప్పి కాపులను నయవంచనకు గురి చేశాడన్నారు. అదే సీఎం జగన్ మాత్రం రిజర్వేషన్ల అంశం తన పరిధిలోనిది కాదని హుందాగా చెప్పడంతో పాటు కాపులను కాపు నేస్తం, అమ్మఒడి, రైతు భరోసా తదితర నవరత్నాల పథకాల ద్వారా ఆర్థికంగా ఎంతగానో ఆదుకున్నారన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని 19,128 మంది కాపు మహిళలకు ఏటా రూ.15 వేలు చొప్పున ఈ నాలుగేళ్లలో రూ.29.11 కోట్లు నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. దీనికి అదనంగా పింఛన్ పథకం ద్వారా రూ.492 కోట్లు, అమ్మఒడి ద్వారా రూ.111 కోట్లు, జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన, విదేశీ విద్య, రైతు భరోసా తదితర 28 సంక్షేమ పథకాల రూపంలో రూ.1420.80 కోట్లు ఖర్చు చేశామన్నారు. విద్య, వైద్యం, ఆర్థిక సహాయాలతో కాపుల జీవితాల్లో గతంలో ఎప్పుడూ లేని విధంగా వెలుగులు నింపాయన్నారు. మహిళలు హర్షం వ్యక్తం చేస్తూ చప్పట్లతో మార్మోగించారు. అనంతరం సభలో పాల్గొన్న సుమారు 3 వేల మంది మహిళలకు మంత్రి వేణు పసుపు, కుంకుమలతో కూడిన తాంబూలం అందించి ఆడపడుచుగా గౌరవించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్ ఎంపీపీలు శాకా బాబీ, దూడల చినబాబు, సర్పంచ్‌లు అనిశెట్టి రామకృష్ణ, పెమ్మిరెడ్డి దొరబాబు, ఎంపీటీసీలు రెడ్నం సతీష్, నాయకులు రేవు శ్రీను, తొగరు మూర్తి, నియోజకవర్గ వ్యాప్తంగా పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి



కోడిగుడ్లను పరిశీలిస్తున్న ఎంపీపీ శ్రీనివాస్

మండపేట: ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు మధ్యాహ్న భోజనం నిర్వహణ కమిటీలు కృషి చేయాలని ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ సూచించారు. మండలంలోని కేశవరం జెడ్పీ ఉన్నత పాఠశాల, పలు ఎంపీపీ పాఠశాలల్లో శనివారం ఆయన మధ్యాహ్న భోజనం నిర్వహణ తీరును పరిశీలించారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో భోజనశాల ఆవరణలో అక్కడక్కడా వ్యర్థాలు ఉండటంతో పంచాయతీ పారిశుధ్య కార్మికులను పిలిపించి పరిసరాలను శుభ్రం చేయించారు. భోజనశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయులకు ఎంపీపీ శ్రీనివాస్ సూచించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మధ్యాహ్న భోజనంలో అనేక మార్పులు చేసి నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందజేస్తున్నారని వివరించారు. వైఎస్సార్ సీపీ నేత కొప్పిరెడ్డి ప్రసాద్, సచివాలయ కన్వీనర్ గనిశెట్టి సత్తిబాబు, లారీ యూనియన్ అధ్యక్షుడు గంధం సూరిబాబు పాల్గొన్నారు.

## స్కూల్ గేమ్స్ సెలక్షన్స్‌లో గొల్లపాలెం విద్యార్థుల ప్రతిభ



జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కాజులూరు: జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ సెలక్షన్‌లో తమ పాఠశాల నుంచి 30 మంది విద్యార్థులు ఎంపికై ప్రతిభను చాటుకున్నారని గొల్లపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం వీవీఎస్ఎస్ మూర్తి అన్నారు. శనివారం పాఠశాలలో జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ రామచంద్రపురం గవర్నమెంట్ హైస్కూల్‌లో ఈ నెల 20, 21 తేదీల్లో జరిగిన నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ క్రీడల్లో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనపరచి పలు విభాగాల్లో జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరు త్వరలో కాకినాడ, అనపర్తిలలో జరిగే రాష్ట్ర స్థాయి సెలక్షన్లలో పాల్గొని అండర్–14, అండర్–17 బాలిక, బాలుర విభాగంలో జరిగే పలు ఆటల పోటీల్లో పోటీపడతారన్నారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులకు, వారికి శిక్షణ నిచ్చిన పీడీ జి.సునీల్‌ను సర్పంచ్ పోతురాజు ప్రసన్నమౌనిక, ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరిదేవి, ఎంపీటీసీ జొన్నకూటి పద్మజ, పీఎంసీ చైర్మన్ మాత నాగరాజు, పాఠశాల సిబ్బంది గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

## గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



అంగరలో ఆరోగ్య సర్వే వివరాలను నమోదు చేస్తున్న ఆరోగ్య కార్యకర్తలు

కపిలేశ్వరపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను వైద్య ఆరోగ్య సిబ్బంది క్షేత్ర స్థాయిలో నిర్వహిస్తున్నారు. అంగర, వాకతిప్ప, అచ్యుతాపురం పీహెచ్‌సీల వైద్యాధికారులు పి.రత్నకుమారి, పి.చంద్రమౌళి, కరుణేంద్రకుమారి పర్యవేక్షణలో శనివారం వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి బీపీ, షుగర్, హెచ్‌బీ, మలేరియా, డెంగీ, కళ్లె పరీక్షలు చేశారు. హెచ్ఈ బి.రామారావు ఆధ్వర్యంలోని బృందం అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లో సర్వే చేశారు. ఆరోగ్య విషయాలను నమోదు చేశారు. ఆరోగ్య కార్యకర్తలు వెన్నేటి వెంకటేశ్వర్లు, చెల్లుబోయిన బేబి తదితరులు పాల్గొన్నారు.

## కేశవరంలో ఎలుకల మందు పంపిణీ



రైతులకు ఎలుకల మందు పంపిణీ చేస్తున్న సొసైటీ చైర్మన్ శ్రీనివాస్

మండపేట: రైతులకు ఎలుకల మందు పంపిణీని శనివారం కేశవరం సొసైటీ వద్ద సొసైటీ చైర్మన్ ముక్కపాటి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటకు తీవ్ర నష్టం కలిగిస్తున్న ఎలుకల నిర్మూలనకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఎలుకల మందును రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయాధికారుల సూచించిన విధంగా ఒకే రోజున రైతులందరూ ఈ మందును పొలాల్లోని ఎలుకల బొరియల వద్ద పెట్టడం ద్వారా వాటి బెడదను అరికట్టవచ్చన్నారు. ఆర్‌బీకే మండల కమిటీ చైర్మన్ అన్నందేవుల చంద్రరావు, ఎంపీటీసీ సభ్యుడు అన్నందేవుల కృష్ణారావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు తుపాకుల ప్రసన్నకుమార్, సొసైటీ డైరెక్టర్లు చేబోలు పోసిబాబు, చంద్రమళ్ళ యేసయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు అద్దంకి రమణ, విన్నకోట ప్రసాద్, కూసు అమ్మన్న, అబ్బిరెడ్డి వీర్రాజు, చల్లా సూర్యనారాయణ, చిరుకూరి బుజ్జి, చిక్కాల బాబురావు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలకు న్యాక్ గ్రేడ్ సాధనే లక్ష్యం



కొత్తపేట డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు ప్రసాద్

కొత్తపేట: స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అన్నింటా అగ్రస్థానంలో నిలిపి, న్యాక్‌లో అత్యున్నత గ్రేడ్ తీసుకురావటానికి అందరం సమష్టిగా కృషి చేద్దామని కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం పిలుపునిచ్చింది. శనివారం సాయంత్రం స్థానిక డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు అధ్యక్షతన కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం జరిగింది. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల త్వరలో న్యాక్‌కు వెళుతుందన్నారు. ఈ లోపు కళాశాలలో చేపట్టవలసిన కార్యక్రమాలను వివరించారు. వాటిని వేగవంతంగా పూర్తి చేయడానికి పూర్వ విద్యార్థులు తమ వంతు సహకరించాలని కోరారు. న్యాక్ గుర్తింపు తద్వారా అత్యున్నత గ్రేడు సాధనతో కళాశాలకు ఎన్నో సౌకర్యాలు సమకూరుతాయన్నారు. అందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. మీ వైపు నుంచి కూడా సహకరించాలని కోరారు. పూర్వ విద్యార్థుల సంఘం తరఫున అధ్యక్షుడు, బ్యాంక్ ఆఫ్ బరోడా రిటైర్డ్ బీఎం ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ అధ్యాపకుల కృషికి తమ సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. సమావేశంలో పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి డీఎండీ ప్రసాద్, కోశాధికారి తనికెళ్ల శాస్త్రి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, ఎన్ఎస్ఎస్ పీఓ డీసీహెచ్ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## పుష్పాలంకరణలో వినాయకుడు



తమలపాకుల అలంకరణలో..



అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామిని చవితి మహోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి, అర్చకులు వివిధ పుష్పాలతో కనులపండువగా అలంకరించారు. అలాగే ఆలయ ప్రాంగణంలో ఓ చోట పుష్పాలతో వినాయకుని ఆకృతిని తీర్చిదిద్దారు. ఈ రెండు చోట్ల స్వామివారి పుష్పాలతో అలంకరించిన తీరు భక్తులను ఆకట్టుకుంది. స్వామికి విశేష పూజలు, పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు, లక్షగరిక పూజ, లక్ష్మీగణపతి హోమం వంటి విశేష పూజలు జరిపారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

తమలపాకుల అలంకరణలో వినాయకుడు

అంబాజీపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద వేంచేసిన శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో ఉన్న వినాయకుడు తమలపాకుల అలంకరణతో శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు మర్ల వెంకట శ్రీనివాస శర్మ గణపతి నవరాత్రుల సందర్భంగా వినాయకుడిని తమలపాకులతో అలంకరించారు. కె.పెదపూడి కుడుపూడివారిపాలెంలో వేంచేసిన లక్ష్మీ గణపతి ఆలయం వద్ద, కొర్లపాటివారిపాలెంలో నెలకొల్పిన గణపతి నవరాత్రుల పందిరి వద్ద భారీ అన్నసమారాధన చేశారు. మాచవరం, పుల్లేటికుర్రు, గంగలకుర్రు మలుపు, జి.అగ్రహారం, తొండవరం, ఇసుకపూడి తదితర ప్రాంతాల్లో గణపతి పందిళ్లలో ప్రత్యేక పూజలు చేశారు.

### అంగరలో గణపతి లడ్డూ వేలం



వేలంలో పాడుకున్న లడ్డూతో పాటదారు సూరిబాబు

కపిలేశ్వరపురం: అంగరలోని చప్పిడిపాలెం ఆది గణపతి చవితి శిబిరంలో శనివారం లడ్డూ వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన యాల్ల సురేష్, గొల్లకోటి ఈశ్వరరావులు 51 కేజీల లడ్డూను సమర్పించారు. ఆలయ నిర్వాహకులు ఆలయం వద్ద వేలం నిర్వహించగా గ్రామానికి చెందిన కొండపల్లి సూరిబాబు రూ.15,100 కి పాడుకున్నారు. స్వామిపై భక్తితో లడ్డూను వేలంలో దక్కించుకున్నానని భక్తులకు, బంధువులకు ప్రసాదంగా పంచినట్టు సూరిబాబు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు పెద్దింశెట్టి సూరిబాబు, యర్రా వీరన్నబాబు, చీకట్ల శ్రీను, పడాల రాంబాబు, బూరయ్య, మేడేపల్లి బుజ్జి, తోరాటి శ్రీను, యర్రా సుబ్బారావు పాల్గొన్నారు.

### ర్యాగింగ్ విష సంస్కృతి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏజీపీ మురళీమోహన్

రామచంద్రపురం: ర్యాగింగ్ విష సంస్కృతి అని, ర్యాగింగ్ కారణంగా విద్యార్థుల భవిష్యత్తు అంధకారమవుతుందని ఏజీపీ, రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీమోహన్ వెంకటరమణ అన్నారు. స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏజీపీ మురళి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వాడ్రేవు సాయి ప్రసాద్, సీనియర్ న్యాయవాది కె.రామచంద్రరావులు ర్యాగింగ్ చట్టం, శిక్షలు తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ చిన్నం వీర్రెడ్డి, జూనియర్ న్యాయవాదుల ప్రతినిధి పిల్లా పృథ్వీ, సీనియర్ న్యాయవాది పీవీఎస్ జానకి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ చిన్నబ్బాయి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### చెరువుగట్టుపై ఆక్రమణల తొలగింపు



అంగర ఊరచెరువు గట్టుపై బడ్డీలను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

కపిలేశ్వరపురం: అంగరలోని ఊర చెరువు గట్టుపై సామాన్యులు ఏర్పాటు చేసుకున్న వ్యాపార బడ్డీలను పంచాయతీ అధికారులు శుక్రవారం తొలగించారు. పంచాయతీ పరిధిలోని చెరువు గట్టుపై ఎవరికీ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, చెరువును పరిరక్షించే బాధ్యతలో భాగంగా చట్ట పరిధిలో ఆక్రమణలను తొలగించినట్టు పంచాయతీ కార్యదర్శి తాతపూడి సుభాకర్ తెలిపారు. అంగర పోలీసు సిబ్బంది బందోబస్తు మధ్య పంచాయతీ సిబ్బంది చెరువు గట్టుపై ఉన్న బడ్డీలను తొలగించారు.

### ఆయుష్మాన్ భారత్ కార్డులతో ఆరోగ్య రక్ష



అంగరలో ఆయుష్మాన్ భారత్ కార్డులను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

కపిలేశ్వరపురం: అంగర గ్రామంలో శనివారం ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పీఎంజేఏవై ఆయుష్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేశారు. సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు మేడిశెట్టి దుర్గారావు, పంచాయతీ కార్యదర్శి మహ్మద్ అలీ, వీఆర్వో పెద్దింశెట్టి నాగమణి, వైద్య ఆరోగ్య కార్యకర్తలు వి.వెంకటేశ్వరావులు ఇంటింటికీ వెళ్లి ఆయుష్మాన్ భారత్ కార్డుల ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో అంగర పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

### సారా కేసులో ఏడాది జైలు

కొత్తపేట: సారాతో పట్టుబడిన కేసులో ఒక వ్యక్తికి సంవత్సరం జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ స్థానిక జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి ఎం.భాస్కరరావు తీర్పునిచ్చినట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. శనివారం సీఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో కొత్తపేట మండలం వాడపాలేనికి చెందిన చోడపనీడి సూర్యచంద్రనాగరాజును గత ఏడాది నవంబరు 25న 5 లీటర్ల సారాతో అరెస్టు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ ఎస్.ఆనందరావు వాదించారు.